

పాపయ్యపేట చమన్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## దాస్యం గెలుపు కోసం ఇంటింటా ప్రచారం

వరంగల్, అక్టోబర్ 29 : వరంగల్ పశ్చిమ నియోజవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ గెలుపు కోసం ఆ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆదివారం పాపయ్యపేట చమన్ ప్రాంతంలో కల్పలత సూపర్ బజార్ వైస్ చైర్మన్ ఎండీ షఫీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. దాస్యం వినయ్‌భాస్కర్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. బీఆర్ఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 92వ బూత్ కన్వీనర్ మాల్వే రాజు, ఎండీ రఫీక్, ఎస్‌కే రహమాన్ తహసీన్, నక్క జ్యోతి, ఎండీ జమీర్, ఎండీ అక్బర్, ఎండీ అఖిల్, షబ్బీర్, అంకూస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## 'పశ్చిమ' ఎన్నికల క్యాంపెయిన్ ఇన్‌చార్జిగా మర్రి యాదవరెడ్డి



హనుమకొండ, అక్టోబర్ 29 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజక వర్గం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల క్యాంపెయిన్ ఇన్‌చార్జిగా కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డిని నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం ప్రకటించిన క్యాంపెయినర్ల జాబితాలో ఆయనకు చోటు కల్పించారు. ఇప్పటికే పార్టీ అభ్యర్థి, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ నియోజక వర్గం పరిధిలో ముమ్మరంగా ప్రచారం చేపడుతున్నారు.

## దాస్యం వినయ్‌భాస్కర్ గెలుపొందాలని యాదాద్రిలో పూజలు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 29 : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందాలని బీఆర్ఎస్ నాయకులు ఆదివారం యాద్రాద్రి లక్ష్మీనర్సింహుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణలో ప్రభుత్వం తిరుపతి తరహాలో యాదాద్రి లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ దేవాలయాలకు పూర్వవైభవం తీసుకువస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వీరగంటి రవీందర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, 8వ డివిజన్ ఇన్‌చార్జి నలుబోలు సతీశ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## డాక్టర్ బైరి నిరంజన్‌కు కేటీఆర్, సంతోష్‌కుమార్ శుభాకాంక్షలు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 29 : బీఆర్ఎస్వీ వ్యవస్థాపక సభ్యుడు, కేయూ అధ్యాపకుడు, సినీ సామాజిక రచయిత డాక్టర్ బైరి నిరంజన్ జన్మదినం సందర్భంగా మంత్రి కేటీఆర్ ఫోన్ ద్వారా, ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ ట్విట్టర్(ఎక్స్) ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ సంతోష్‌కుమార్ ఇచ్చిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను స్వీకరించి నిరంజన్ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవాళి ప్రశాంత జీవితాన్ని కోరుకునే చెట్టును బతికించాలని కోరారు.



గ్రీన్‌ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మొక్క నాటి, నీరు పోస్తున్న నిరంజన్

## నేటి గ్రీవెన్స్‌లు రద్దు

వరంగల్/ హనుమకొండ, అక్టోబర్ 29 : గ్రేటర్ కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం సమావేశం, అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించి, వినతులు ఇచ్చేందుకు కార్యాలయానికి రావొద్దని సూచించారు. అలాగే, హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌ను కూడా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా పరమైన కారణాలతో రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు వినతి పత్రాలు ఇచ్చేందుకు రావొద్దని కోరారు.

# గెలిపించండి.. మరింత అభివృద్ధి చేస్తా..

- తెలంగాణలో అన్ని వర్గాలకు సమప్రాధాన్యం
- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- మైనార్టీలకు అండగా సీఎం కేసీఆర్
- ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్



కాజీపేట : దాస్యం వినయ్‌భాస్కర్‌ను ఆశీర్వదిస్తున్న అల్ఫా ఓమెగా చర్చి బిషప్ డాక్టర్ జాన్ మార్కండేయ

కాజీపేట, అక్టోబర్ 29 : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట 47వ డివిజన్ పరిధి బాపూజీనగర్‌లోని ఆల్ఫా ఓమెగా చర్చిలో కోతకాల కృతజ్ఞత అర్పణాల పండుగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి బిషప్ డాక్టర్ జాన్ మార్కండేయ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, దాస్యం వినయ్‌భాస్కర్‌ను ఆశీర్వదించారు. ప్రజా సేవల్లో ముందుండే వినయ్‌భాస్కర్‌కు రాబోయే ఎన్నికల్లో క్రైస్తవులందరూ అండగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సర్వమతాలను సమానంగా చూసే సీఎం కేసీఆర్ నన్ను ఆశీర్వదించి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బరిలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మళ్లీ అవకాశం ఇచ్చారన్నారు. అందరూ ఎన్నికల్లో ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించి, ఆశీర్వదించాలని కోరారు. గతంలో కొంత మంది చాలా ప్రాంతాల్లో మసీదులు, చర్చిలు నిర్మించుకోకుండా అడ్డుతగిలితే ముస్లింలు, క్రైస్తవులకు బీఆర్ఎస్ అండగా నిలిచిందన్నారు. నగరం సర్వమత సమ్మేళనానికి నిదర్శనంగా నిలుస్తున్నదన్నారు. అల్ఫా ఓమెగా చర్చి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రభువు దయతో సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అర్హులైన వారికి అందించారన్నారు. కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు, 47, 63వ డివిజన్ల అధ్యక్షులు దువ్వ కనకరాజు, బెదరికోట రంజిత్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నార్లగిరి రమేశ్, శిరుమల్ల దశరథం, మహ్మద్ సోని, నయీం జుబేర్, బండి చందర్, మంద శ్రీను, క్రైస్తవులు బొక్క రమేశ్, మహేశ్, ఐలేశ్, కృష్ణ, మొగిలి, కరుణాకర్ పాల్గొన్నారు.

**అండగా ఉంటా.. ఆశీర్వదించండి**

హనుమకొండ : అండగా ఉంటా ఆశీర్వదించండి అని చీఫ్ విప్, దాస్యం వినయ భాస్కర్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం గ్రేటర్ 50, 51, 59వ డివిజన్లలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. హౌసింగ్ బోర్డు కాలనీలో కార్పొరేటర్ బోయినపల్లి రంజిత్‌రావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు, ప్రజలు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్‌కు హారతి ఇచ్చి, బొట్టు పెట్టి మరోసారి గెలిపించుకుంటామని సంఘీభావం తెలిపారు. అనంతరం దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ పనిచేసిన ప్రభుత్వానికే మద్దతుగా నిలువాలని కోరారు. సంక్షేమ పథకాల అమలులో పశ్చిమ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపినట్లు తెలిపారు. పేద ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో వారి అభ్యున్నతికి పాటుపడుతానని తెలిపారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పన, సంక్షేమ కార్యక్రమాల అమలుకు పదేళ్లలో రూ.5 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని చీఫ్‌విప్ అభ్యర్థించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, డివిజన్ కార్పొరేటర్లు, అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వినయ్‌భాస్కర్‌కు ఆఫీసర్స్ క్లబ్ సంపూర్ణ మద్దతు

హనుమకొండ, అక్టోబర్ 29 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌కు వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ మేరకు దొంతి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం క్లబ్‌లో సభ్యులను దాస్యం వినయ్ భాస్కర్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. క్లబ్‌లోని సభ్యులందరూ తనకు అత్యంత ఆప్తులని అన్నారు. ప్రతి ఒక్కరితో వ్యక్తిగత అనుబంధం ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రేమ్ సాగర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పాపిరెడ్డి, కేశవరావు, చల్లా శ్రీనివాసరెడ్డి, నల్ల రాజిరెడ్డి, సీహెచ్ రాజిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, రాజ్‌కుమార్, అగర్వాల్, క్రెడాయ్ ప్రెసిడెంట్ తిరుపతిరెడ్డి, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ జనార్దన్, మనోహర్ రావు, ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



వినయ్ భాస్కర్‌కు మద్దతు తెలుపుతున్న వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు

# దాస్యం గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి

- అభివృద్ధిని ప్రజలకు వివరించాలి
- కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్

న్యూశాయంపేట, అక్టోబర్ 29 : వరంగల్ పశ్చిమ బీఆర్ఎస్ అభ్యర్థి, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఈగ మల్లేశం కోరారు. అదివారం హంటర్‌రోడ్డులోని అభిరామ్ గార్డెన్‌లో 31వ డివిజన్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని కార్పొరేటర్ మామిండ్ల రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సుందర్‌రాజ్ యాదవ్, ఈగ మల్లేశం పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ దాస్యం వినయ్‌భాస్కర్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. ఇంటింటికి బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను తీసుకెళ్లాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీల చేసే జిమ్మిక్కులు, మాయ మాటలకు మోసపోవద్దని సూచించారు. ప్రతిపక్ష పార్టీలకు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలు గుర్తుకువస్తున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పేదల కోసం ఏమీ చేయని పార్టీలు.. ఎన్నికలు వస్తున్నాయంటే ఊసరవెల్లులా రంగులు మారుస్తూ వస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఎవరెన్ని రంగులతో వచ్చినా తెలంగాణలో ప్రజలంతా గులాబీ జెండా నీడనే కోరుకుంటున్నారన్నారు. ప్రజల మద్దతుతో ముఖ్యమంత్రి కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జోరిక రమేశ్, మాడిశెట్టి శివశంకర్, డివిజన్ అధ్యక్షుడు ఆలకుంట్ల వెంకన్న, మాజీ అధ్యక్షుడు వేల్పుల వేణుగోపాల్, మహిళా అధ్యక్షురాలు ఉష, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండు సదానందం, గన్నారపు ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న సుందర్‌రాజ్ యాదవ్